క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు యనమలకుదురులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. గంగూరు సబ్‌స్టేషన్ నుంచి నుంచి నూతన ఫీడర్ల ఏర్పాటు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. దీని కారణంగా ఇందిరానగర్, తాడిగడప డొంక రోడ్డు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని స్థానికులు సహకరించాలని కోరారు.

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి. హరిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దావాజిగూడెం, అల్లాపురం, పామర్తినగర్ సెంటర్, పాలిటిక్నిక్ కళాశాల రోడ్డు, రైస్‌మిల్ బజారు, ఎస్టీబీఎల్ కాలనీ, మల్లికార్జున స్కూల్ రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

డొంకరోడ్డుకు మరమ్మతులు

రామవరప్పాడు: రూరల్ మండలం ప్రసాదంపాడు నుంచి కానూరు వెళ్లే డొంకరోడ్డులో సర్పంచ్ సర్నాల గంగారత్నం చొరవతో దాతలు ముందుకొచ్చి మరమ్మతులు చేయిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డుపై గోతులు పడ్డాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సమస్య పరిష్కారానికి ఈ దారిలో ఉన్న గోడౌన్లు, చిన్నపాటి కంపెనీల వారితో మాట్లాడి గోతులను మట్టితో పూడ్పించారు.

అన్ని ఆర్‌బీకేల్లో యూరియా

కంకిపాడు: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి పిఎం కిరణ్ తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు యూరియా అవసరం ఉందన్నారు. రైతుభరోసా కేంద్రాలు, హోల్‌సేల్ వ్యాపారుల వద్ద ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల్లో 100 టన్నులు యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. యూరియా కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. ఎరువుల నిల్వలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పోరంకి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. బొడ్డపాడుకు చెందిన వక్కలగడ్డ శివశంకర్‌రావు, ఆయన కుమారుడు రఘుబాబు ఆటోనగర్‌లో పనికి బైక్‌పై బయలుదేరారు. ప్రభునగర్ వద్దకు రాగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న శివశంకర్‌రావు కిందపడి పోవటంతో గాయాలయ్యాయి. బాధితుడిని విజయవాడలో ని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య చికిత్సకై చేర్చారు. ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.


కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ హర్షణీయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటన చేయటంపై వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెలగపల్లి ప్రదీప్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నిర్ణయం వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపిందన్నారు. 2014 జూన్ 2వ తేదీ నాటికి ముందే నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు విడుదల చేయటంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటారని చెప్పారు.

దౌర్జన్యం చేసిన బంధువులపై కేసు

పెనమలూరు: పోరంకిలో మహిళ పై దౌర్జన్యం చేసిన బంధువుల పై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లో ఉంటున్న రాయపాటి విజయశ్రీకి పోరంకిలో ఇల్లు ఉంది. ఆమె ఈ నెల 12వ తేదీన ఇంటి వద్దకు వచ్చిన సమయంలో ఆమె తల్లి కిలారు లక్ష్మి, బంధువులు కిలారు విజయ్‌ప్రసాద్, రంగారావు, రాయపాటి శివరామ్‌చంద్ అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి ఆస్తి కోసం తగాదాపడి దౌర్జన్యం చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పోలింగ్ కేంద్రం పరిశీలన



ఉయ్యూరు: మండలంలోని గండిగుంటలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ విమాదేవి పరిశీలించారు. గండిగుంట పంచాయతీలో ఈ నెల 19న ఉప ఎన్నిక జరగనుంది. ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ విమాదేవి పరిశీలించి ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

చెరువుల అభివృద్ధికి రూ.5.50 కోట్లు ఖర్చు

- తాడిగడప మున్సిపాలిటీలో శరవేగంగా అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



తాడిగడపలో చెరువు అభివృద్ధికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో చెరువుల అభివృద్ధికి రూ.5.50 కోట్లు నిధులు ఖర్చు చేస్తున్నామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప గ్రామంలో అమృత్ 2.0 పథకం కింద రూ.1.55 కోట్లతో చెరువు అభివృద్ధికి ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ పోరంకి, కానూరు, తాడిగడప గ్రామాల్లో చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం చెరువులు అవసాన దశలో ఉన్నందున సుందరీకరణకు కృషి చేస్తున్నామని చెప్పారు. చెరువులో వ్యర్థపదార్థాలు తొలగించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, మొక్కలు నాటి, అభివృద్ధి పనులు చేస్తామన్నారు. గ్రామాల్లో ప్రజలు ఉదయం, సాయంత్రం చెరువుల వద్ద కూర్చొని అహ్లాదకరమైన వాతావరణంలో గడిపే విధంగా చూస్తామన్నారు.

తాడిగడప అభివృద్ధి చేస్తా..

తాడిగడప గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. గ్రామంలో అంతర్గత రహదారులు, కాలువ కట్టల అభివృద్ధి, తాగునీరు, డ్రైనేజీ పనులు చేశామన్నారు. రానున్న రోజుల్లో మిగిలిన అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. గత ఎన్నికల్లో గ్రామస్తులకు ఇచ్చిన హామీలు అమలు చేశామని తెలిపారు. కమిషనర్ ఎస్.ప్రకాశరావు, గ్రామ ప్రముఖులు మేడసాని శ్రీనివాసరావు, మేడసాని రమేష్, కిలారు గోపాలకృష్ణ, చదలవాడ సుధాకర్, యలవర్తి రమేష్, వైఎస్సార్ సీపీ నేతలు నర్రా చంటి, పోలవరపు బాబీ, మేడసాని రత్తయ్యబాబు, మేడసాని శ్రీనివాసరావు, మేడసాని చిట్టి, ఖాదర్‌బాషా, జిన్నా, క్రిష్టోఫర్, పి.ఆదిశేషు, ముజీబ్, ఎం.లక్ష్మి వివిధ గ్రామాల నేతలు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో సంతోషం

ఎమ్మెల్యే పార్థసారథి



ఉయ్యూరు నాలుగో వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: సంక్షేమ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 4వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలనతో ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించి బ్రోచర్లు అందజేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఏ ఇంటికి వెళ్లినా జగనన్న చేసిన మేలును చెప్పి ప్రభుత్వానికి బాసటగా నిలుస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు బురద రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కులాలు, మతాలు, వర్గాలుగా ప్రజలను విభజించి చిచ్చు పెట్టే ప్రయత్నాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఉయ్యూరు ఎస్సీ కాలనీకి తారురోడ్డు నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కౌన్సిలర్లు డాక్టర్ జంపాన పూర్ణిమ, తెనాలి పద్మావతి, గోన మదన్, గుంజా సుధాకర్ బాబు, టీఎల్ఎఫ్ లీడర్ మాలతీరాణి, నాయకులు షేక్ అబూకలాం, అబ్దుల్ సద్దాం, నిడుమోలు పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆహార, ఆరోగ్య భద్రతపై శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సువర్ణ

గన్నవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆహార, ఆరోగ్య భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్. సువర్ణ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం పిల్లల ఎదుగుదలకు దోహద పడుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు హౌస్ విజిట్ ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విధిగా పిల్లల బరువును కచ్చితంగా తీయాలని చెప్పారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి. వెంకటలక్ష్మి, పలువురు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోరుతూ ర్యాలీ



హనుమాన్‌జంక్షన్‌లో మానవత సభ్యుల ర్యాలీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్‌లో గురువారం శాంతి ర్యాలీ చేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్ వద్ద ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ జెండా ఊపి శాంతి ర్యాలీ ప్రారంభించారు. మానవత సభ్యులు.. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. జంక్షన్ ప్రధాన రహదారుల్లో ర్యాలీ చేసి, మెయిన్‌సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. మానవత జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, కోశాధికారి పాత్రోలు గణేష్, సీనియర్ సభ్యులు గంటా సత్యనారాయణ, ఇందిరాదేవి పాల్గొన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి

ఉయ్యూరు: మేలైన వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. మండలంలోని బోళ్లపాడు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. శాస్త్రవేత్త సుధారాణి మాట్లాడుతూ వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సామూహిక ఎలుకల నివారణ చేపట్టి పంటను రక్షించుకోవచ్చని తెలిపారు. మేలైన వ్యవసాయ పద్ధతుల్లో భాగస్వామ్య కార్యాచరణ పరిశోధన ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి, జిల్లా వనరుల కేంద్రం డీడీ జ్యోతిరమణి, ఏడీఏ శ్రీనివాస్, డిపిఎం పార్థసారథి, గన్నవరం ఏడీఏ సునీల్, ఏఓ నిస్సిగ్రేస్, రైతులు తుమ్మూరు సంజీవ రెడ్డి, అమరేశ్వరరెడ్డి, ఎం.నాగాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు

గన్నవరం: దేశంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంతో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు రాయితీల పేరుతో లక్షల కోట్ల రూపాయలు దోచిపెడుతున్న కేంద్రం పన్నుల రూపంలో పేదల నడ్డివిరుస్తుందని మండిపడ్డారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30 నుండి ఆగస్టు 4వ తేదీ వరకు చేపట్టిన ప్రజా ఉద్యమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. రఘు, బుద్ధవరం సర్పంచి బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

29న అరుణాచలం బస్ సర్వీస్

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఈ నెల 29వ తేదీన అరుణాచలం గిరిప్రదక్షిణ ప్రత్యేక బస్ సర్వీస్ నడపనున్నట్లు డిపో మేనేజర్ పి. శివాజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీస్ 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు బస్టాండ్ నుంచి బయలుదేరి 30వ తేది ఉదయం శ్రీకాళహస్తికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడ స్వామి దర్శనం తర్వాత మధ్యాహ్నం కాణిపాకం విఘ్నేశ్వరస్వామి దర్శనం, గుడిలో భోజనం, రాత్రికి అరుణచలం చేరుకుంటుందన్నారు. 31వ తేది పౌర్ణమి రోజు ఉదయం గిరి ప్రదక్షిణ, స్వామి వారి దర్శనం, మధ్యాహ్నం కంచి కామాక్షి అమ్మవారి దర్శనం ఉంటుందన్నారు. అదే రోజు రాత్రి తిరుగు ప్రయాణమై సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం 10 గంటలకు గన్నవరం చేరుకుంటారని తెలిపారు. యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధరను రూ. 3 వేలుగా నిర్ణయించినట్లు వివరించారు. ఇతర వివరాలకు 8790996090, 7382905633 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

■ ఊపందుకున్న సాగు పనులు



జిల్లా వ్యాప్తంగా చెదురుమొదురుగా వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. చోడవరం వద్ద కంద చేనుకు మందు పిచికారీ చేస్తున్న రైతును చిత్రంలో చూడవచ్చు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పాడి రైతులకు బోనస్ పంపిణీ

గన్నవరం: పాడి రైతులకు కృష్ణ మిల్క్ యూనియన్ అండగా నిలుస్తుందని విజయ డెయిరీ డైరెక్టర్లు దాసరి వెంకటబాలవర్ధనరావు, పాలగుడు నాని పేర్కొన్నారు. స్థానిక విజయ డెయిరీ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌లో గురువారం పాడి రైతులకు బోనస్‌లు పంపిణీ నిమిత్తం గన్నవరం క్లస్టర్ పరిధిలోని 124 పాల సేకరణ కేంద్రాలకు రూ. 90.90 లక్షల చెక్కులను అందజేశారు. యూనియన్ డైరెక్టర్లు చలసాని చక్రపాణి, పలగాని కొండలరావు, ట్రస్ట్ సభ్యులు హరిరామకోటిరెడ్డి, పి. రత్నప్రసాద్, ఫీడ్ కమిటీ సభ్యులు శివరామప్రసాద్, జీఎం జీ. అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

110 మందికి కంటి పరీక్షలు



కంకిపాడు: కంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి సకాలంలో వైద్యం చేయించుకోవాలని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని నెప్పల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం గురువారం నిర్వహించారు. 60 ఏళ్లు నిండిన 110 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని, ప్రభుత్వం ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. వాటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

20న జూనియర్స్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): గన్నవరంలోని బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 20వ తేదీన జూనియర్స్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.అనిల్ కుమార్, ఆర్ సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 2008 నుంచి డిసెంబర్ 2009 మధ్య జన్మించిన బాలబాలికలను ఎంపిక చేస్తామన్నారు. అర్హత గల ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. క్రీడాకారులు రిజిస్ట్రేషన్ కోసం పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీని తీసుకురావాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ శివారులోని పొలవరం కుడి ప్రధాన కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం పోలీసులు గుర్తించారు. ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు సంఘటనాస్థలికి చేరుకుని కాలువలో మృతదేహాన్ని బయటకు తీసినట్లు తెలిపారు. మృతుడు సుమారుగా 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉండవచ్చని, బిస్కెట్ కలర్‌పైన నలుపు రంగు పూలు కలిగిన ఫుల్ హ్యాండ్ షర్ట్, నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యువల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న లెక్చరర్స్ 2023–2024 విద్యా సంవత్సరానికి రెన్యూవల్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, కళాశాల విద్యాశాఖ, రాజమహేంద్రవరం వారి ఆదేశాల మేరకు ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల నందు 2022–2023 విద్యా సంవత్సరంలో మార్చి 31 తేదీ నాటికి కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పని చేసిన వారు మాత్రమే కాంట్రాక్ట్ పునరుద్ధరణకు అర్హులన్నారు. అర్హత కలిగిన అధ్యాపకులు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వచ్చిన దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్ ఐడీ కళాశాల(ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల) ప్రిన్సిపాల్‌కు సమర్పించాలన్నారు. 23వ తేదీన కాంట్రాక్ట్ పునరుద్ధరణకు జిల్లా ఎంపిక కమిటీ ముందు అభ్యర్థులు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు 24వ తేదీన ఆయా కళాశాలల్లో బాండ్లు సమర్పించాలని ఆమె కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఫైబర్‌నెట్ కనెక్షన్

ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి

నున్న(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి ఫైబర్‌నెట్ కనెక్షన్ ఇస్తామని ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి.గౌతంరెడ్డి అన్నారు. గురువారం ఆయన నున్న గ్రామంలోని ఫైబర్‌నెట్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటి 50లక్షల కనెక్షన్లను విశాఖపట్నం నుంచి స్టేట్ నెట్‌వర్క్ ఆపరేషన్ నిర్వహిస్తారన్నారు. ఎలక్ట్రికల్ పోల్స్ నుంచి కనెక్షన్లు ఇస్తారని, గ్రామాల్లో ఎక్కడైతే విద్యుత్‌సబ్‌స్టేషన్లు ఉన్నాయో వాటి ఆవరణలోనే ఫైబర్‌నెట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తే విద్యుత్ సరఫరాకు అవాంతరం లేకుండా ఉంటుందన్నారు. చైర్మన్‌తో పాటు సేల్స్ మేనేజర్ భాస్కరరెడ్డి, టెక్నికల్ మేనేజర్ మహేష్ తదితరులున్నారు.

జెడ్పీ పాఠశాలలో చెట్లు పరిశీలన



జెడ్పీ పాఠశాలలో చెట్లను పరిశీలిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి సుజాత

ఉయ్యూరు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను జిల్లా అటవీశాఖ అధికారి సుజాత గురువారం సందర్శించారు. పాఠశాలలో తరగతి గదుల నిర్మాణాలకు అడ్డుగా ఉన్న చెట్లను పరిశీలించారు. చెట్ల తొలగింపు, బహిరంగ వేలం, ప్రభుత్వ నిర్ధారిత ధర అంశాలపై ఎంపీడీఓ విమాదేవి, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావుతో చర్చించి చెట్లను నరికి బహిరంగ వేలం నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారు. పాఠశాలలో తొమ్మిది తరగతి గదుల నిర్మాణాలకు 36 చెట్లు అడ్డుగా ఉన్నాయని ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. చెట్లను తొలగించేందుకు ఈనెల 19న సాయంత్రం 4 గంటలకు పాఠశాల ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. రూ.2,21,240గా ప్రభుత్వం చెట్ల విలువను నిర్ణయించిందన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

చెట్ల నరికివేతపై ఫిర్యాదు

ఉయ్యూరు:గురజాడ పంట కాలువ గట్లపై చెట్ల నరికివేసిన ఘటనపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ కంకిపాడు ఏఈ టి.వీరాంజనేయులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువ గట్టుపై ఉన్న సుబాబుల్, ఇతర చెట్లను కేసీపీ యాజమాన్యం అక్రమంగా నరికివేసిందని, ఇరిగేషన్ ఆస్తులను ధ్వంసం చేసిందని పేర్కొన్నారు. బాధ్యులుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు :శ్రీచైతన్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థి అదృశ్యం అవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పులివెందుల వేంపల్లికి చెందిన జి.శ్రీనివాసరెడ్డి కుమారుడు ఆదిత్యవర్ధన్ రెడ్డి తాడిగడప శ్రీ చైతన్య పాఠశాల మయూరి క్యాంపస్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 15వ తేదీన అవుట్ పాస్ తీసుకుని ఎవ్వరికీ చెప్పకుండా పాఠశాల నుంచి బయటకు వచ్చి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పై పాఠశాల ప్రిన్సిపాల్ పి.శివ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విద్యార్థి అదృశ్యం పై పోలీసులు కేసు నమోదు చేశారు.

కంకిపాడు ఉపఎన్నికకు సర్వం సిద్ధం

కంకిపాడు: కంకిపాడు పంచాయతీలో 9వ వార్డు ఉప ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 9వ వార్డు, తెన్నేరు 7వ వార్డు, ప్రొద్దుటూరు 4వ వార్డుల ఉప ఎన్నికకు షెడ్యూల్ ఖరారైంది. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యే సరికి తెన్నేరు, ప్రొద్దుటూరు వార్డు స్థానాలకు ఒకే నామినేషన్ చొప్పున దాఖలు కావటంతో ఆ రెండు స్థానాలను ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. మండల కేంద్రమైన కంకిపాడు 9వ వార్డుకు త్రిముఖ పోటీ నెలకొంది. వైఎస్సార్ సీపీ మద్దతుతో మలబంటి దుర్గాప్రసాద్ అలియాస్ చిన్నమ్ములు, టీడీపీ నుంచి చలవాది రాజా, జనసేన, బీజేపీ సంయుక్త అభ్యర్థిగా పి.ప్రవీణ్ కుమార్ బరిలో ఉన్నారు. ఉప ఎన్నిక నిర్వహణ నిమిత్తం కంకిపాడు ఎంపీపీ ఆదర్శ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పాఠశాలలో రెండు బూత్‌లను పోలింగ్‌కు సిద్ధం చేశారు. 9వ వార్డు పరిధిలో 727 ఓట్లకు గానూ రెండు ఓట్లు తొలగింపు జరగ్గా 725 ఓట్లు ఉన్నాయి. వీరిలో పురుషులు 371 మంది, మహిళలు 354 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయభాస్కర్, ఎన్నికల అధికారి సీతా రామరాజు, రెవిన్యూ, పోలీసు శాఖల అధికారులు సందర్శించారు. ఎన్నికలకు సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఉదయ్‌బాస్కర్ తెలిపారు.

సమష్టి కృషితోనే సొసైటీ ఎన్నికల్లో విజయం

కంకిపాడు: సమష్టి కృషితోనే సొసైటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా విజయాన్ని సాధించామని గొడవర్రు ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొప్పుల భాస్కర్‌రావు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల జరిగిన సొసైటీ ఎన్నికల్లో తన ప్యానెల్ ఏకగ్రీవంగా విజయాన్ని సాధించిందన్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సూచనలతో ప్రణాళికాబద్ధంగా వ్యూహరచన చేశామన్నారు. కొన్ని పత్రికల్లో సొసైటీ విజయానికి సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ సహకరించలేదని, పార్టీ పెద్దలు వార్నింగ్ ఇచ్చారంటూ ఓ పత్రికలో విష ప్రచారం జరుగుతుందన్నారు. ఇందులో వాస్తవం లేదన్నారు. సొసైటీ విజయానికి పార్టీ నేతలు, సర్పంచ్ విజయ చంద్రశేఖర్ సమష్టిగా పనిచేశారని, దాని వల్లే విజయాన్ని సాధించామని చెప్పారు.